క్లుప్తంగా

నేడు వెళాంగణిమాత మందిరం వార్షికోత్సవం



పొలువాయి జంక్షన్(రెంటచింతల): స్థానిక వెళాంగణిమాత మందిర వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు కానుక మాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు పలువురు ఫాదర్లు సమిష్టి దివ్యపూజాబలి సమర్పించనున్నట్లు అనంతరం వార్షికోత్సవ వేడుకలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వెళాంగణి మాత దీవెనలను పొందాలని ఫాదర్ కోరారు. మండల కేంద్రమైన రెంటచింతలకు చెందిన దుగ్గింపూడి కస్పారెడ్డి ఈ వెళాంగణి మందిరం నిర్మించినట్లు ఆయన తెలిపారు. స్థానిక ఆరోగ్యపురం కాలనీలోని ఆరోగ్యమాత మందిరంలో సోమవారం సాయంత్రం 5.30 గంటలకు పవిత్ర సమిష్టి దివ్యపూజబలిని సమర్పించడం జరుగుతుందన్నారు.

వివేకానంద స్కూల్ డైరెక్టర్స్‌కు సన్మానం



పిడుగురాళ్ల: ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన వివేకానంద స్కూల్ ప్రిన్సిపాల్ సుప్రియ, డైరెక్టర్ రామకృష్ణలను పిడుగురాళ్ల ఏవీవోపీపీ సభ్యులు ఆదివారం సత్కరించారు. పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో అభినందన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ.. గుంటూరులో నిర్వహించిన టీచర్స్ డే సెలబ్రేషన్ వేడుకల్లో ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్, శ్రీహర్ష ఐఐటీ, నీట్ అకాడమి ఉత్తమ ఉపాధ్యాయులురాలిగా సుప్రియను ఎంపిక చేయటం ఎంతో అభినందనీయమని కొనియాడారు.

లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్‌గా సతీష్



పిడుగురాళ్ల: పట్టణానికి చెందిన టంగుటూరి సతీష్ లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్‌గా నియమిస్తూ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ 316 గవర్నర్ సీహెచ్ హరిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేసినట్లు లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ టంగుటూరి సతీష్ ఆదివారం తెలిపారు. అనంతరం సతీష్‌ను పిడుగురాళ్ల పట్టణంలోని పలువురు పురప్రముఖులు సన్మానించారు.

వ్యక్తిపై గొడ్డలితో దాడి



మాచర్ల రూరల్: వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మండలంలోని కంభంపాడులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంజరబోయిన శ్రీనివాసరావు అలియాస్ రెంటాల శ్రీను, బుస్సా మల్లికార్జునరావు ఒకే వీధిలో నివసిస్తుంటారు. ఆదివారం పట్టణ శివారులోని మహాలక్ష్మీ డెయిరీలో జరిగిన ఫంక్షన్‌లో ఇరువురు మద్యం మత్తులో దుర్భాషలాడుకున్నారు. అక్కడి వారు ఇరువురిని సర్దుబాటు చేసి ఇంటికి పంపగా, ఘర్షణను మనసులో పెట్టుకున్న గుస్సా మల్లికార్జునరావు తన కొడుకుతో కలిసి అదే దారిలో వెళ్తున్న రెంటాల శ్రీనుపై గొడ్డలితో దాడి చేసి తలపై, చేతులు, కాళ్లపై తీవ్రంగా గాయపరిచాడు. గాయపడిన శ్రీనివాసరావును 108లో నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ సంధ్యారాణి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నల్లమలలో విత్తన బంతులు చల్లిన ప్రకృతి ప్రేమికులు



కారెంపూడి: నల్లమల ఫారెస్ట్‌లోని మైదాన ప్రాంతాలలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యావరణ సంస్థల ప్రతినిధులు ఆదివారం విత్తన బంతులు చల్లారు. వనాల అభివృద్ధి, అడవుల పెంపకం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కొమెర అంకారావు(జాజి) పిలుపు మేరకు వారంతా కారెంపూడి తరలి వచ్చారు. వారంతా వారి వెంట తెచ్చుకున్న వేలాది విత్తన బంతులను నల్లమల ఫారెస్ట్‌లోని చెట్ల సంఖ్య తక్కువగా ఉన్న చోట చల్లారు.

ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ హైమారావు తెలిపారు. ఆదివారం కోట సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో ప్రయాణికులను రవాణా చేస్తుండగా నిలిపారు. వాహనంలో సుమారు 32 మంది మహిళలు ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆటోడ్రైవర్‌ను సీఐ హైమారావు హెచ్చరించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పీఆర్కేకు ఘన స్వాగతం

- భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- అక్రమ నిర్బంధాలను ఛేదించుకుని ర్యాలీ
- అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగిన పీఆర్కే



పట్టణంలో భారీ ఊరేగింపుతో పీఆర్కేను భుజాలపై ఎక్కించుకొని తీసుకొస్తున్న దృశ్యం

మాచర్ల రూరల్: వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి అడుగడుగునా ఘన స్వాగతం లభించింది.

అక్రమ కేసుల బనాయించి వంద రోజులకు పైగా నియోజక వర్గానికి దూరం చేసినా అదే ఆదరణ.. అదే ఆప్యాయత.. అదరని.. బెదరని కార్యకర్తల పెల్లుబుకిన అభిమానం. సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్‌తో ఆదివారం నియోజక వర్గంలోకి వందరోజుల తరువాత అడుగుపెట్టారు. రైతుల పక్షాన జగనన్న ఇచ్చిన పిలుపు మేరకు అన్నదాత పోరుబాటలో పాల్గొనేందుకు వచ్చిన పీఆర్కేకు నాగార్జున సాగర్, రైట్ బ్యాంక్ నుంచి ఏకోనాంపేట, 7వ మైలు, తాళ్లపల్లి, భైరవుని పాడు, కొత్తపల్లి జంక్షన్ వరకు వేలాది మంది కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. పోలీసుల నిర్బంధాన్ని లెక్క చేయకుండా జై జగన్.. జై జై పీఆర్కే అంటూ నినాదాలతో ద్విచక్ర వాహనాల ర్యాలీలతో గ్రామ, పట్టణ, పల్లెల్లో హోరెత్తించారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ఘన స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు, నాయకులు

చక్కని చిరునవ్వుతో ప్రతి ఒక్క కార్యకర్తని ఆప్యాయంగా పలకరిస్తూ చెదరని చిరునవ్వుతో చేతులు జోడించి అభివాదం చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. పట్టణంలో భారీ ర్యాలీ, కార్యకర్తల మధ్య పట్టణంలో ప్రవేశించిన పీఆర్కేను కార్యకర్తలు తమ భుజాలపై ఎక్కించుకొని బస్టాండ్ వెనుక ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మల్లుస్వామి, వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి పోతురెడ్డి కోటిరెడ్డి, ఉపాధ్యక్షులు తాడి వెంకటేశ్వరరెడ్డి, అబ్దుల్ జలీల్, షేక్ మస్తాన్, కొండలు, ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్నాయి..!



తనతో పాటు చదివిన పూర్వ విద్యార్థులతో డాక్టర్ కారసాని

- 37 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు
- సంతమాగులూరు జెడ్పీలో 1987-88 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నరసరావుపేట: కలిసి చదువుకొని వివిధ ప్రదేశాల్లో, వివిధ వృత్తుల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 37ఏళ్ల అనంతరం ఒక చోట కలుసుకున్నారు. వారిలో ప్రముఖ హృద్యోగ నిపుణులు, మహాత్మాగాంధీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి కూడా ఒకరు. 1987-88లో సంతమాగులూరు జెడ్పీహైస్కూలులో పదోతరగతి చదివిన వారందరూ ఆదివారం పల్నాడురోడ్డులోని ఓ హోటల్ కాన్ఫరెన్స్ హాలులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారిలో మహిళలతో సహా 32మంది ఉన్నారు. ఆత్మీయంగా పలుకరించుకొని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలు, చేసిన అల్లరిని గుర్తుచేసుకున్నారు. తమ కుటుంబాలను గురించి, తమ యోగక్షేమాలను గురించి ఒకరినొకరు చెప్పుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను తలుచుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ కారసానిని ఘనంగా సత్కరించారు. అందరూ కలిసి భోజనం చేసి, మళ్లీ మరోసారి కలుసుకుందామని, బరువైన హృదయాలతో వెనుతిరిగారు.

ఆర్టీసీ బస్సు ఏర్పాటుకు టెస్ట్ రన్



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

నూజెండ్ల: వినుకొండ నుంచి మండలంలోని జంగాలపల్లె, త్రిపురాపురం, గొల్లపాలెం, తలార్లపల్లె, రెడ్డిపాలెం నుంచి నూజెండ్లకు బస్సు సౌకర్యం ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు ఆదివారం టెస్ట్ రన్ నిర్వహించారు. ఇటీవల రెడ్డిపాలెం గ్రామసర్పంచ్ ఆళ్ల గురవారెడ్డి, గ్రామపెద్దలు గ్రామానికి బస్సు ఏర్పాటు చేయాలని గ్రీవెన్సులో వినతిపత్రం అందజేయడంతో అధికారుల ఆదేశాల మేరకు టెస్టు రన్ చేస్తున్నామని ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ ధనలక్ష్మి తెలిపారు. గ్రామస్తుల అభిప్రాయాలు తీసుకుంటున్నామన్నారు. బస్సులు లేకపోవటంతో మహిళలు, విద్యార్థులు, వృద్ధులు ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నామని అధికారుల వద్ద వాపోయారు. ప్రైవేట్ వాహనాలపై ప్రయాణం ప్రమాదభరితంగా ఉందని బస్సు నడిపితే సౌకర్యంగా ఉంటుందని అధికారుల దృష్టికి తెచ్చారు. నూజెండ్ల జెడ్పీ పాఠశాల జూనియర్ అసిస్టెంట్ సుదర్శన్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు సైతం పాఠశాలకు వెళ్లేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తుందని తెలిపారు. విద్యార్థులకు అనుకూలమైన సమయాల్లో బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ ధనలక్ష్మి మాట్లాడుతూ పల్లెలను కలుపుతూ నూజెండ్లకు బస్సు ఏర్పాటు పై గ్రామస్తుల అభిప్రాయాలు, సూచనలు అధికారులకు నివేదిక ఇస్తామన్నారు.

షాక్ కొడుతున్న బిల్లు



బిల్లు చూపిస్తున్న వెంకటేశ్వరరాజు

అమరావతి: పేదవారిమైన మాకు ఈ నెల వచ్చిన విద్యుత్ బిల్లు షాక్ కొట్టినట్టు అయిందని మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామానికి చెందిన నండూరి కోటేశ్వరమ్మ, వెంకటేశ్వరరాజు దంపతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం తమకు అధికంగా వచ్చిన విద్యుత్ బిల్లు గురించి వివరిస్తూ తాము రోజు కూలీ పని చేసుకుని జీవిస్తామని, తమ విద్యుత్ సర్వీస్ నెంబర్ 755కు ఈ నెల రూ.1,948 బిల్లు వచ్చిందని ఆందోళన చెందారు. భర్త వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ గత నెలలో రూ.390 బిల్లు వచ్చిందని, ఈ నెలలో రూ.1,948 బిల్లు ఎలా వచ్చిందో అర్థం కావటం లేదని వాపోయాడు. ఇంట్లో ఇద్దరమే నివసిస్తామని గ్రామ పంచాయతీ కుళాయి నీళ్లు వచ్చినప్పుడు మాత్రమే మోటర్ వేస్తాం తప్ప మిగిలిన సమయంలో కరెంటు ఎక్కువగా వాడకం ఉండదని, ఇంత బిల్లు ఎందుకు వచ్చిందని కరెంటు ఆఫీసులో సిబ్బందిని అడిగితే మీరు ఎక్కువగా వాడుకొని ఉంటారు విద్యుత్ మీటర్ కరెక్ట్ గానే ఉన్నదని సమాధానమిచ్చారన్నారు. ఇంతింత కరెంటు బిల్లులు వస్తే ఏ విధంగా కట్టగలుగుతామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ మీటర్లు సరిచేయాలని కోరినప్పటికీ.. అధికారులు మాత్రం ప్రస్తుతం బిల్లు జమ చేయాల్సిందేనని కరాఖండిగా చెప్పారన్నారు.

యూరియా కొరత సమస్యను పరిష్కరించాలి

కారెంపూడి: యూరియా సమస్యను సకాలంలో పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్ ఆదివారం పేర్కొన్నారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే దానిని పూర్తి స్థాయిలో పరిష్కారం చేయలేకపోయారన్నారు. కారెంపూడి నుంచి తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా యూరియా తరలిస్తున్న వారిపై 6ఏ కేసుతో సరిపెట్టారన్నారు. కష్టాలపడి సాగు చేసి దేశానికి అన్నంపెట్టే రైతన్నల విషయంలో ఏ తప్పు జరిగినా అది జాతి ద్రోహంగా పరిగణించాలని, ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా యూరియాను పాత ధరలకే అమ్మేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రగ్రహణం దృష్ట్యా దేవాలయాల మూత

మాచర్ల: సంపూర్ణ చంద్రగ్రహణం దృష్ట్యా ఆదివారం మధ్యాహ్నం నుంచి పట్టణంలోని దేవాలయాలు మూసివేశారు. అర్చకులు, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, ఆయా దేవాలయలు మూసివేశారు. సోమవారం ఉదయం 6గంటల తరువాత దేవాలయాలను శుద్ధిచేసిన అనంతరం దేవాలయాలను తెరవనున్నట్లు అర్చకులు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావెలకు నివాళి



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావెల విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏజీకేఎమ్ వాకర్స్ క్లబ్ బాధ్యులు

సత్తెనపల్లి: ఏజీకేఎమ్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కాపుగంటి వెంకటరత్నం ఆధ్వర్యంలో సత్తెనపల్లి మాజీ శాసనసభ్యుడు డాక్టర్ రావెల వెంకట్రావు 8వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావెల వెంకట్రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1978వ సంవత్సరంలో డాక్టర్ రావెల వెంకట్రావు కాంగ్రెస్(ఐ) నుంచి పోటీ చేసి ప్రత్యర్థి సీపీఎం అభ్యర్థి పుతుంబాక వెంకటపతిపై విజయం సాధించారన్నారు. 1978 నుంచి 1983 వరకు ఐదేళ్ల పాటు ఆయన నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఆయన కుమారుడు రావెల చంద్రశేఖర్, ఏజీకేఎమ్ వాకర్స్ క్లబ్ బాధ్యులు పుట్టి సాంబశివరావు, ఆళ్ల చంద్రశేఖరరావు, దాసరి కోటేశ్వరరావు, షేక్ జాకీర్ హుస్సేన్, జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు(మౌర్య), దేసు సోమశేఖర్, దూపగుంట్ల పూర్ణచంద్రరావు (పూర్ణ), శీలం ఏడుకొండలు, ఉడుముల వెంగళరెడ్డి, వీరారెడ్డి, మట్ట దుర్గాప్రసాద్, బత్తుల శ్రీనివాసరావు, ఎరగ్రుంట్ల కిషోర్, శొంఠినేని లక్ష్మీనారాయణ, శిరసాల భుజంగరావు, దేవతి నాగమల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు



రొంపిచర్ల: మండలంలోని మాచవరం గ్రామంలో గల ఎరువుల దుకాణాన్ని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు ఆదివారం తనిఖీ చేశారు. ప్రతి రైతుకు డీబీటీ ద్వారా ఎరువులు అందజేయాలని హెచ్చరించారు. రసాయనిక ఎరువులు ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్స్‌ను కూడా రద్దు చేస్తమని హెచ్చరించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రైతులకు ఎరువుల అవసరాలపై చర్చించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి శివలలిత, ఏఈఓ బ్రహ్మయ్య, వెంకట్రావు పాల్గొన్నారు.

680 మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ



నార్నెపాడులో ఎరువుల పంపిణీని పరిశీలిస్తున్న ఏవో శ్రీధర్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్

ముప్పాళ్ళ: మండలంలోని పలు సొసైటీలు, ప్రైవేటు దుకాణాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 680 మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ చేయటం జరిగిందని, సాగుకు అవసరమైన ఎరువులు దఫాలుగా అందుబాటులో ఉంచటం జరుగుతుందని ఏవో ఎస్.శ్రీధర్‌రెడ్డి ఆదివారం చెప్పారు. సాక్షి దినపత్రికలో 'యూరియా.. ఏదయా' శీర్షికన యూరియా కొరతపై ప్రచురించిన కథనంపై వ్యవసాయాధికారులు స్పందించారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలోని రైతు సేవా కేంద్రం ద్వారా యూరియా పంపిణీని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో ఎస్.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జీడీసీఎంఎస్ బ్రాంచ్ ద్వారా ఇప్పటి వరకు 171 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయటం జరిగిందని, మండలంలో ఇప్పటి వరకు 680 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేయటం జరిగిందన్నారు. రాబోయే 4, 5 రోజుల్లో మరో 100 మెట్రిక్ టన్నుల యూరియా రానున్నదని చెప్పారు. పంటల విస్తీర్ణం ఆధారంగా రైతులకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా ఎరువులు సరఫరా చేయటం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులు కూడా అవసరం మేరకే కొనుగోలు చేయాలని సూచించారు.

జున్నుసాహెబ్‌కు గురుబ్రహ్మ పురస్కారం



యడ్లపాడు: మండలంలోని కొండవీడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న షేక్ జున్నుసాహెబ్ విశాఖపట్నంకు చెందిన సెయింట్ మదర్‌థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నుంచి గురుబ్రహ్మ పురస్కారం అందుకున్నారు. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ అవార్డులు అందిస్తున్నారు. ఉపాధ్యాయ విభాగంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు పలువురికి అవార్డులు అందించారు. పురస్కారం అందుకున్న జున్నుసాహెబ్‌ను ఎంఈఓ నాగరత్నం, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు అభినందించారు.

ఆదిత్య బ్రాహ్మణ సేవాసమితి ఆవిర్భావ దినోత్సవం



గురుసత్కారం అనంతరం వేదికపై బ్రాహ్మణ సమితి నాయకులు

పలువురు గురువులకు ఘనసత్కారం

చిలకలూరిపేట: పట్టణానికి చెందిన ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చినపసుమర్రు పరిధిలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న సమితి భవనంలో ఆదివారం ఈ వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా జ్యోతి పథకం కింద 12మంది పేదబ్రాహ్మణ విద్యార్థులకు రూ.50 వేలు ఉపకార వేతనాలు అందజేశారు. ఇదే వేదికపై గురుపూజోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు అబ్బరాజు ప్రసాద్ - ఉషారాణి, లక్కరాజు రాము - లలిత దంపతులు, అబ్బరాజు సీతారామారావు ఉపాధ్యాయులు, అర్చక విభాగంలో సోమరాజు రంగారావు, పురోహిత వర్గంలో శనగల రామకృష్ణను అతిథులు సత్కరించి, జ్ఞాపికల్ని బహూకరించారు. ముఖ్య అతిథిగా నరసరావుపేటకు చెందిన విశ్రాంతి హెచ్ఎం జీవీ సుబ్బారావు హాజరై బ్రాహ్మణ సేవా సమితి భవనం పూర్తి పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సమితి అధ్యక్షుడు ఏకా మారుతిరామశర్మ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు చల్లా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పోలూరి చంద్రమౌళి, బిల్డింగ్ కమిటీ వైస్ చైర్మన్ తాటికోల అనిరుద్ధ, కోపల్లె తులసిరామ్, ప్రచార కార్యదర్శి ధూళిపాల శ్రీకాంత్, కోశాధికారి పావులూరి శేషగిరిరావు, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన మసీదు నిర్మాణానికి శంకుస్థాపన



హసనాబాద్(క్రోసూరు): మండలంలోని హసనాబాద్ గ్రామంలో నూతన మసీదు నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన జరిగింది. గ్రామంలో 14 సెంట్ల విస్తీర్ణంలో అల్‌హుదా ట్రస్ట్ చైర్మన్ మౌలానా అబ్బాస్‌ఖాన్ నబీ ఆధ్వర్యంలో రూ.35 లక్షల అంచనాతో నిర్మాణం చేపట్టనున్న మసీదును శంకుస్థాపన చేశారు. గ్రామంలో మొత్తం 450 ముస్లిం కుటుంబాలుండగా ఒక్కటే మసీదు ఉండటంతో పెద్దల సహకారంతో రెండవ మసీదు నిర్మిస్తున్నట్లు క్రోసూరు జగనన్న కాలనీ మసీదు ఇమామ్ జమాలుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున్న ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ముస్లింలు, చుట్టపక్కల గ్రామాల ముస్లింలు పాల్గొన్నారు.

షటిల్ పోటీల విజేతలకు బహుమతులు



అచ్చంపేట: స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అచ్చంపేటలోని ఇన్‌డోర్ స్టేడియంలో శనివారం అర్ధరాత్రి వరకు అచ్చంపేట, క్రోసూరు మండలాల పరిధిలో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు నిర్వాహకులు ఆదివారం నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. పోటీలు సీనియర్, జూనియర్ విభాగాలలో జరగగా, మొత్తం 20 జట్లు పాల్గొన్నాయి. సీనియర్ విభాగంలో కొంజేటి సీతారామస్వామి, డి.శివమణి జట్లు, జూనియర్ విభాగంలో ఎం.వెంకటేశ్వరరావు, పి.వెంకట్రావు జట్లు విజయం సాధించాయి. ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విజేతలకు గాదె ఇన్నారెడ్డి జ్ఞాపకార్థం గాదె సుధాకర్ రెడ్డి, రూ.3,000, తుమ్మా స్లీవారెడ్డి జ్ఞాపకార్థం ఇన్నారెడ్డి, రూ.2,000 నగదు బహుమతులతో పాటు షీల్డ్ బహుకరించారు. కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రముఖులు, పలు గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతులు ఎరువులు నిల్వ చేయకూడదు



జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు

నార్నెపాడు(ముప్పాళ్ళ): రైతులు అనవసరంగా ఎరువులను నిల్వ చేయకూడదని, పంటకు ఎంత మేర అవసరమో ఆ మేర మాత్రమే తీసుకువెళ్లాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు చెప్పారు. మండలంలోని నార్నెపాడు రైతు సేవా కేంద్రంలో ఎరువుల పంపిణీ ప్రక్రియను ఆదివారం ఆయన పరిశీలించారు. జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచటం జరిగిందన్నారు. ఎరువుల తీసుకున్న రైతులందరికీ ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో, రియల్ టైం యాప్‌లో రైతుల వివరాలన్నీ అప్‌డేట్ చేయాలని రైతు సేవా కేంద్రం సిబ్బందికి సూచించారు. ఎరువుల డీలర్లు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మితే ఎరువుల చట్టం 1985 కింద చట్టపరమైన చర్యలు తీసుకుని, లైసెన్సు రద్దు చేస్తామని చెప్పారు. రైతులు కూడా యూరియా బదులుగా ప్రత్యామ్నాయంగా వాడుకోవాలని అవగాహన కల్పించారు. ఏవో ఎస్.శ్రీధర్ రెడ్డి, ఏఈవోలు శేషుబాబు, బ్రహ్మయ్య, ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

సత్తెనపల్లి: గుర్తు తెలియని వృద్ధుడు రోడ్డు పక్కన మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురు ఉన్న దుర్గా బార్ అండ్ రెస్టారెంట్ వెనుక వైపు ఉన్న చెట్లలో స్పృహ లేకుండా ఓ వృద్ధుడు పడి ఉండగా శ్రీహరి అనే వ్యక్తి చూసి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. 108 అంబులెన్స్ వచ్చి పరిశీలించి చూడగా వృద్ధుడు స్పృహ లేకుండా ప్రాణాలతో ఉండటంతో వెంటనే సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తీసుకువెళ్లారు. వైద్యులు పరిశీలించి మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీసులను సంప్రదించాలని పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

చౌకధరల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

సత్తెనపల్లి: పట్టణంలోని 14, 21 వార్డుల్లోని చౌకధరల దుకాణాలలో పౌరసరఫరాల జిల్లా అధికారి ఎంవీ ప్రసాదరావు శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ దుకాణాల్లో ఈ-పాస్ మిషన్ ద్వారా భౌతిక నిల్వలు, క్షేత్రస్థాయి నిల్వలను పరిశీలించారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న పేదలకు సక్రమంగా నిత్యావసరాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆయనతోపాటు డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

బైక్‌ను దహనం చేసిన దుండగులు



బెల్లంకొండ: రోడ్డు మీద పార్క్ చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించి తగలబెట్టిన ఘటన మండల కేంద్రమైన బెల్లంకొండలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుడు నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బీరవల్లి రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బెల్లంకొండ సొసైటీ కార్యాలయం ఎదురుగా తన గ్లామర్ బైక్‌ను పార్క్ చేసి మరో వ్యక్తితో కలసి మద్యం తాగడానికి వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను కిందపడేసి నిప్పు అంటించి వెళ్లినట్లు పేర్కొన్నాడు. తిరిగి వచ్చి చూడగా బైక్ పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపారు. ఈ ఘటనపై వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు రమణారెడ్డి తెలిపారు.